ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు జిల్లా వార్తలు
బుధవారం 8 మే 2024



పసుపు సంద్రం పుంగనూరు

ఆంబోతు కొమ్ములు విరిచేయండి

● పెద్దిరెడ్డిపై చంద్రబాబు ధ్వజం

పుంగనూరులోని ఎన్టీఆర్ సర్కిల్‌లో వెల్లువెత్తిన జనం

సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

పెద్దిరెడ్డి పొగరుబోతు. ఆంబోతులా తయారయ్యారు. కొమ్ములు విరిచేయండి. వీరి కుటుంబ రాజకీయ ఆధిపత్యానికి గండి పెట్టడానికి కిరణ్‌కుమార్‌రెడ్డి వచ్చారు. పాపాల పెద్దిరెడ్డికి నిద్రలేని రాత్రులు చూపిస్తాం.

మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు మేలు చేసే వ్యక్తి. గతంలో రాజకీయపరంగా విభేదించామే తప్ప కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదు.

శివశక్తి డెయిరీ ద్వారా పుంగనూరు నియోజకవర్గ రైతుల్ని దోచేశారు. చివరికి మా హెరిటేజ్‌ను కూడా వీరి ప్రాంతానికి రానివ్వరు. మామిడి ధరల్ని తగ్గించి రైతులకు అన్యాయం చేసి.. అక్కడా కమీషన్లు తీసుకున్నారు. అనుమతుల్లేని రిజర్వాయర్ల ద్వారా రైతులకు అన్యాయం చేశారు. పెద్దిరెడ్డికి, కిరణ్‌కుమార్‌రెడ్డి పోలిక అస్సలు లేదు.

● చంద్రబాబు సభ సక్సెస్ ● తెలుగు తమ్ముళ్లలో పెరిగిన జోష్

పుంగనూరు, మే 7: పుంగనూరు వీధుల్లో పసుపుజెండా రెపరెపలాడింది. పట్టణమంతా పసుపుమయంగా మారింది. గతేడాది ఆగస్టు 4న చంద్రబాబునాయుడు పూతలపట్టుకు వెళ్లే క్రమంలో పుంగనూరు వద్ద టీడీపీ శ్రేణులు, పోలీసుల మధ్య జరిగిన గొడవ రణరంగంగా మారింది. ఆ సమయంలో టీడీపీ శ్రేణులు పుంగనూరుకు రావాలంటూ ఆహ్వానించగా త్వరలోనే వస్తానని వెళ్లారు. అనంతరం పోలీసులు ఇష్టారాజ్యంగా నమోదుచేసిన కేసులతో టీడీపీ జెండా పట్టాలంటేనే శ్రేణులు భయపడే పరిస్థితి. ఈ క్రమంలో మంగళవారం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో మోటారు సైకిళ్లు, వాహనాలు, బస్సుల్లో టీడీపీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చారు. వీరిలో ఉత్సాహం ఉరకలేసింది. సభ జరిగినంతసేపూ టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు ఆనందంతో కేరింతలు కొడుతూ కనిపించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పాపాల పెద్దిరెడ్డి అంటూ సంబోధిస్తూ తీవ్రస్థాయిలో చంద్రబాబు విమర్శలు చేయడంతో సభికుల నుంచి విశేషస్పందన లభించింది. సీఎం జగన్‌ను జగ్గూబాయ్ అనడం, పుంగనూరు ప్రజలు పెద్దిరెడ్డికి బానిసలు కాదని, ఇక్కడి ప్రజల్లో పౌరుషం ఉందా అంటూ పలుమార్లు జనాన్ని ప్రశ్నించారు. పుంగనూరు నుంచే పెద్దిరెడ్డి రాజకీయ పతనం మొదలవుతుందని వ్యాఖ్యానించారు. జనం స్పందన గమనిస్తూ నాలుగు వైపులా తిరుగుతూ చిరునవ్వుతో చంద్రబాబు కనిపించారు.

ఐదేళ్ల తర్వాత.. 2019 ఎన్నికల సమయంలో పుంగనూరు మండలం సింగిరిగుంట వద్ద చంద్రబాబునాయుడు హంద్రీనీవా జలాలకు పూజలు చేశారు. నాటి టీడీపీ అభ్యర్థి ఎన్.అనీషారెడ్డిని గెలిపించాలని ప్రచార సభలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఇప్పుడు పుంగనూరు వచ్చారు. పుంగనూరు కేంద్రంగా మంత్రి పెద్దిరెడ్డి ఆయన కుమారుడు ఎంపీ మిధున్‌రెడ్డికి వస్తున్న అవినీతి ఆదాయాన్ని మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి లెక్క కట్టి ప్రజలకు వివరించారు. మాజీ సీఎంలు చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి సభ సందర్భంగా ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. అడుగడుగునా పోలీసుల పహారా, నిఘా, సీఆర్పీఎఫ్ పోలీసుల బందోబస్తుతో ప్రశాంతగా చంద్రబాబు పర్యటన ముగిసింది. భారీగా పోలీసు బలగాలు రావడంతో పార్టీ శ్రేణుల్లో చంద్రబాబు సీఎం కాబోతున్నారని తెలిసి భద్రత పెరిగిందనే చర్చ జరిగింది.

క్షణం సంతోషం కోసం జీవితాన్ని పాడు చేసుకోవద్దని ఎయిడ్స్ ప్రకటన వచ్చేది. ఇప్పుడు వీళ్లు ఇచ్చే డబ్బుల కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. పెద్దిరెడ్డి ఎయిడ్స్ కంటే ప్రమాదకరం.

'పెద్దిరెడ్డి అక్రమాలు అవినీతి గురించి మాట్లాడితే దానికి స్పందించకుండా ఏదేదో మాట్లాడుతున్నాడు. నేను ఎవరి కాళ్లో పట్టుకున్నానని చెప్పాడు. డీసీసీ పదవి కోసం నా కాళ్లను పట్టుకున్న వ్యక్తి అతడు. దానికి కూడా సమాధానం లేదు.

జగన్‌రెడ్డిని నేను అరెస్టు చేయించానని చెప్పాడు. షర్మిలనే చెప్పింది సోనియాకు సంబంధంలేదని. సాయిబాబా ట్రస్టు నుంచి బంగారమంతా తీసుకెళ్లానని చెప్పాడు. నేను అయ్యప్ప స్వామి గుడి వద్ద, కాణిపాకం వచ్చి ప్రమాణం చేస్తానని చెప్పాను. దానికీ పెద్దిరెడ్డి స్పందించలేదు.

\- నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి

పెద్దిరెడ్డి కుటుంబం వేల కోట్లను దోచేసింది

● ఇక నిద్ర లేని రాత్రులు చూపిస్తా
● పుంగనూరు సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

పుంగనూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): 'మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంట్రాక్టర్లు వీళ్లే. ఇసుక, మద్యం, మైనింగ్ వ్యాపారాలు వీళ్లవే. ఇలా పెద్దిరెడ్డి కుటుంబం రూ.వేల కోట్లను దోచేసింది' అని టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. పుంగనూరులో మంగళవారం సాయంత్రం జరిగిన ప్రచార సభలో ఆయన మాట్లాడారు. రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి, పుంగనూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు.

టీడీపీ శ్రేణులపై వేధింపులు మరచిపోలేను

'పుంగనూరులో దాడులు జరగని రోజు, అక్రమ కేసులు పెట్టని రోజు, అరెస్టులు జరగని రోజు లేదు. చౌడేపల్లె బస్టాండు వద్ద టీడీపీ జెండా దిమ్మె తొలగించారు. సదుంలో టీడీపీ నేత రాజారెడ్డిని కిడ్నాప్ చేసి కొట్టారు. పుంగనూరులో టీడీపీ కార్యాలయానికి భవనం అద్దెకిచ్చిన యజమానిని బెదిరించి ఖాళీ చేయించారు. పెద్దిరెడ్డికి స్వాగత బ్యానర్లను తన ఇంటి వద్ద కట్టొద్దని చెప్పినందుకు నవీన్‌కుమార్‌ను అరెస్టు చేశారు. మృత్యుంజయస్వామి ఆలయాన్ని పునర్నిర్మించిన టీడీపీ నేత రమణారెడ్డిపై తప్పుడు కేసులు పెట్టారు. సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో చల్లా బాబుపై దాడిచేసి 13 మందిపై కేసులు పెట్టారు. వైసీపీ జెండా కట్టొద్దని చెప్పినందుకు చౌడేపల్లె టీడీపీ నేత రమేష్‌రెడ్డి సహా 41 మంది ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారు. వాళ్లు జైల్లో ఉన్నప్పుడు కూడా స్థానికంగా ఎవరూ లేకుంటే వేరే ప్రాంతం నుంచి మనుషుల్ని పంపించి వారి కుటుంబాలకు ఆర్థిక సాయం చేశాం. గతేడాది పుంగనూరులో నాపై దాడి చేయించి నాపైనే కేసులు పెట్టించారు. 800 మంది టీడీపీ శ్రేణులపై కేసులు పెట్టి 450 మందిని జైల్లో పెట్టడంతో తన గుండె రగిలిపోతోంది' అన్నారు.

పెద్దిరెడ్డిని ఎదుర్కొనే దీటైన నాయకుడు చల్లా

'పాపాల పెద్దిరెడ్డిని శాశ్వతంగా రాజకీయాల నుంచి భూస్థాపితం చేయండి. పెద్దిరెడ్డి చేతిలో ఓసారి చల్లా ఓడిపోయారు. ఈసారి చల్లా చేతిలో పెద్దిరెడ్డి ఓడిపోతున్నారు. పెద్దిరెడ్డిని ఎదుర్కొనే దీటైన నాయకుడు చల్లా బాబు' అన్నారు.

పాపం రామచంద్ర యాదవ్

'బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ పెద్దిరెడ్డి సొంతూరు సదుంకు వెళ్లినందుకు అక్కడి వైసీపీ శ్రేణులు అతనిపై అతని అనుచరులపై దాడి చేశారు. వాహనాల్ని స్టేషన్ ఎదుటే తగలబెట్టారు. కొవ్వు పట్టి పెద్దిరెడ్డి చేస్తున్న పనుల్ని అణిచివేస్తా'నని చంద్రబాబు చెప్పారు.

బాబు సభకు వెళ్లకుండా వైసీపీ తాయిలాలు

చంద్రబాబు సభకు జనం రాకుండా వైసీపీ నాయకులు గ్రామాల్లో విందులు ఇచ్చారు. యువత, మహిళలకు డబ్బులు ఇవ్వడం, మరికొంతమందికి మందు పంపిణీ చేశారు. పలు చోట్ల మీటింగ్‌కు వెళ్లరాదంటూ నాయకులు హుకుం జారీ చేశారు. అయినా, వీరి అంచనాలకు మించి జనం రావడం గమనార్హం.

అధికారంలోకి వస్తే..

'కుప్పంతో సమానంగా పుంగనూరును చూసుకుంటా. ఉర్దూ రెసిడెన్షియల్ కాలేజీ ఏర్పాటుచేస్తాం. హజ్ యాత్రకు వెళ్లే ముస్లింకు రూ.లక్ష ఇస్తాం. మసీదులకు 5 వేలు ఆర్థిక సాయం చేస్తాం. ఇమామ్, మౌజన్లకు రూ.10 వేలిస్తాం. చింత పండు ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి అధిక ధర లభించేలా చేస్తాం. స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ఏర్పాట్లు, టెక్స్‌టైల్స్ పరిశ్రమ, నర్సింగ్ కాలేజ్ ఏర్పాటు చేస్తాం' అని చంద్రబాబు హామీనిచ్చారు.

ప్రజలూ ఒకసారి ఆలోచించండి

● మేలు చేసే వారికి ఓటేయండంటూ భువనేశ్వరి పిలుపు



కుప్పం/శాంతిపురం, మే 7: తమకు మేలు చేసేది ఎవరు? కీడు చేసేది ఎవరు? అనేది ప్రజలు ఆలోచించి ఓటేయాలని నారా భువనేశ్వరి కోరారు. ఈ అయిదేళ్లలో జగన్ ప్రభుత్వం రాష్ట్రం.. ప్రజల విషయంలో చేయని అన్యాయం, అరాచకం లేదన్నారు. దీనికి విరుద్ధంగా చంద్రబాబు నిరంతరం ప్రజలకోసమే పనిచేస్తారని గుర్తుచేశారు. 75 ఏళ్ల వయసులోనూ ఎంతో కష్టపడుతున్నారని, తనను నమ్మిన ప్రజలకోసం ఈ కష్టాన్ని ఇష్టంగా భరిస్తున్నారన్నారు. శాంతిపురం మండలం బెల్లకోగిల ఎస్సీ కాలనీ, బెల్లకోగిల, చంద్రగిరి క్రాస్, రేగడదిన్నేపల్లె, సోగడబల్ల, బోయనపల్లెల్లో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్‌షోలలో ఆమె మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో మ్యానిఫెస్టో ప్రకటించారని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే ఎవరి భూమిపై వారికి హక్కులు ఉండవన్నారు. వైసీపీ నేతల చేతికి ఆ భూములు చేరిపోతాయన్నారు. 'ఇది అరాచకానికి, అభివృద్ధికి మధ్య జరుగుతున్న యుద్ధం. ఓటు అనే ఆయుధంతో అరాచక, అన్యాయ వైసీపీని రాష్ట్రంనుంచి తరిమికొడదాం' అని పిలుపునిచ్చారు.

ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.3

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. తిరుపతి				
2. శ్రీకాళహస్తి				
3. సత్యవేడు				
4. గంగాధర నెల్లూరు				
5. చంద్రగిరి				
6. పీలేరు				
7. మదనపల్లి				
8. తంబళ్లపల్లి				
9. పుంగనూరు				
10. పలమనేరు				
11. కుప్పం				
12. చిత్తూరు				
13. పూతలపట్టు				
14. నగరి				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం, సర్వే నెం. 717 బి/5, తూకివాకం గ్రామం & పోస్టు, రేణిగుంట మండలం, తిరుపతి జిల్లా - 517520, ఆం.ప్ర.

షరతులు వర్తిస్తాయి

జన కేతనం

బుధవారం 8 మే 2024

● మీకు తెలుసా — పోలీసైనా నో ఎంట్రీ


పోలింగ్ రోజున పోలీసులకు కూడా పోలింగ్ బూత్‌లోకి అడుగు పెట్టేందుకు అనుమతి ఉండదు. శాంతి భద్రతలకు విఘాతం కలిగితే తప్ప వారు లోపలికి వెళ్లకూడదు. అదీ ప్రిసైడింగ్ అధికారి ఆదేశాల మేరకే వెళ్లాలి. పోలింగ్ జరుగుతున్నంత సేపు వారు బయట మాత్రమే విధులు నిర్వర్తించాలి. పోటీ చేసే అభ్యర్థికి జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్నా... ఆయన వెంట ఉండే రక్షణ సిబ్బంది కూడా లోపలకు వెళ్లరాదు. అభ్యర్థితో పాటు మఫ్టీలో ఉన్న ఒక్కకేపే అనుమతి ఉంటుంది.

- చిత్తూరు కలెక్టరేట్

● మీకు మళ్లీ ఓటెందుకెయ్యాలి?

జగన్ మెప్పుకోసం విపక్షాల మీద విరుచుకుపడే ఆర్కే రోజా నగరి నియోజకవర్గ అభివృద్ధికి ఈ ఐదేళ్లలో ఓ వీసమెత్తు మంచి చేయలేదు. నోరు తప్ప చేతలు శూన్యం. నియోజకవర్గంలోని వనరుల దోపిడీ విచ్చలవిడిగా సాగడానికి ఆమె అండగా నిలబడ్డారనే ఆరోపణలున్నాయి. రేషను బియ్యం, ఇసుక.. చివరికి మట్టినీ మంత్రిగారి అనుచరులు వదల్లేదు. ఆమె ఇద్దరు సోదరులు వసూల్ రాజాలుగా జనం నోళ్లలో నానిపోయారు. ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్‌గా ఉండీ నియోజకవర్గానికి ఒక్క పరిశ్రమను కూడా తేలేకపోయిన రోజా పర్యాటక మంత్రిగానూ చేసింది ఏమీ లేదు. ఎన్నికల వేళ నగరి నియోజకవర్గ ప్రజలు రోజా చెప్పిన మాటలనూ, చేతలనూ గుర్తుచేసుకుంటున్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో నగరిని ఉంచిన రోజాకు మళ్లీ ఓట్లు ఎందుకు వేయాలని చర్చించుకుంటున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



నోరు తప్ప.. చేతలేవి రోజమ్మా?

ఐదేళ్ల అరాచకాలు, అవినీతి సామ్రాజ్యంపై జనాగ్రహం

నగరి ప్రజల చెవిలో రోజా పూలు

హామీ: మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల కరెంటు ఉచితంగా అందిస్తాను.
అమలు: ఉచితంగా కరెంటు ఇవ్వకపోగా వెయ్యి రూపాయల లోపు వచ్చే కరెంటు బిల్లు జగన్ ప్రభుత్వంలో రూ.3000 వస్తోంది.

హామీ: నగరిలో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేస్తా.
అమలు: ఈ హామీని గాలి కొదిలేశారు.

హామీ: గాలేరు-నగరి పూర్తి చేసి, నియోజకవర్గంలో తాగు, సాగు నీటి కొరత లేకుండా చేస్తాను.
అమలు: ఈ ఐదేళ్లలో ఒక తట్ట మట్టి కూడా ఎత్తలేదు. పైగా టీడీపీ హయాంలో పనులు జరిగి మిగిలిపోయిన మట్టి, ఇసుక, గ్రావెల్ వంటివి వైసీపీ వాళ్లు దోచుకెళ్లారు.

హామీ: గాజులమండ్యం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తాను
అమలు: టీడీపీ హయాంలో ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేసిన రోజా, ప్రభుత్వం దాన్ని లిక్విడేషన్‌కు ఇచ్చేసినా నోరు తెరవలేదు.

హామీ: వడమాలపేట, విజయపురం మండలాల్లో పారిశ్రామికవాడలు ఏర్పాటు చేస్తా.
అమలు: ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్‌గా, మంత్రిగా ఉన్నా.. నియోజకవర్గంలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకునిరాలేక పోయారు.

హామీ: పుత్తూరులోని 50 పడకల ఆసుపత్రిని వంద పడకలకు అభివృద్ధి చేస్తాను.
అమలు: అటువంటి ప్రతిపాదన కూడా ప్రభుత్వానికి పంపించలేదు.

హామీ: నింద్ర షుగర్ (ప్రైవేటు) ఫ్యాక్టరీని వేలం వేసి అయినా రూ.36 కోట్ల రైతుల బకాయిలు ఇప్పిస్తా.
అమలు: బకాయిల గురించి పట్టించుకోనేలేదు.

నెలనెలా వాటాలు

● తమిళనాడుకు సరిహద్దున ఉన్న నగరి నియోజకవర్గంలో మట్టి కూడా బంగారంగా మారింది. వైసీపీవారు తాత్కాలిక లైసెన్సులతోనే నెలల తరబడి మట్టిని తమిళనాడుకు తరలించేసి కోట్లు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మంత్రి రోజాకు నెలవారీ వాటాలు అందేవని విపక్షాలు ఆరోపిస్తుంటాయి.

● కుశస్థలి నదిలో ఇసుకను దోచేశారు. ఆంధ్రా ఇసుకకు తమిళనాడులో డిమాండ్ ఉండడంతో వందల కోట్లు వెనకేసుకున్నారు. ఇక్కడా రోజాకు వాటాలు దక్కేవని ఆరోపణలు ఉన్నాయి.

● రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కర్ణాటకకు తరలించి పాలిష్ చేసి అమ్మేసే పనులు అధికారపార్టీ వారు జోరుగా చేసేవారు. ఇందులోనూ రోజాకు నెల మామూళ్లు వెళ్లేవని చెబుతుంటారు.

● నియోజకవర్గంలోని రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి నెల మామూళ్లు సమర్పించుకోవాలని విమర్శలున్నాయి. మంత్రికి భయపడి గతంలో ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు బదిలీ చేసుకుని వెళ్లిపోయారంటారు. తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, మున్సిపల్ కార్యాలయాల నుంచి కూడా వీరి ట్రస్టుకు విరాళాల రూపంలో ముడుపులు సమర్పించుకోవాల్సిందేనని చెబుతారు.

భూంధాం!

● విజయపురం మండలంలో 300 ఎకరాల ప్రభుత్వ భూములను తన అనుచరుల పేర్లతో రోజా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారనే అంశం వివాదం అయ్యింది. విచారించిన జిల్లా అధికారులు ఆ భూముల్ని వెనక్కి తీసుకుని నలుగురు కింద స్థాయి రెవెన్యూ ఉద్యోగులను సస్పెండ్ చేశారు.

● వడమాలపేట అంజరమ్మకనుమ వద్ద వినోబాబావే భూదానోద్యమానికి వచ్చిన 12 ఎకరాల భూమిని బినామీ పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వెనుక రోజా హస్తం ఉందనే ప్రచారం జరిగింది.

● వడమాలపేట మండలం పాదిరేడులో ఇండస్ట్రియల్ పార్కు కోసం భూమి సేకరించారు. అంతకుముందే అక్కడి కాలువ, రాస్తా, డీకేటీ భూములకు పట్టాలు చేయించి సుమారు రూ.12 కోట్ల పరిహారం పొందినట్లు సమాచారం.

దబాయింపులు

● కంకర క్రషర్ల మీద అధికారులతో దాడులు చేయించి భారీ మొత్తంలో వసూలు చేసినట్లు కూడా ఆరోపణలున్నాయి. దీంతో చాలామంది క్రషర్లను మూసేశారు. టీడీపీకి చెందిన ఓ వ్యక్తి క్రషర్‌కు రూ.కోట్లలో జరిమానా విధించి.. రూ.2 కోట్లు డిమాండ్ చేశారని, దీంతో ఆయన గుండెపోటుతో మరణించారని ఆరోపణలున్నాయి.

● నియోజకవర్గంలో ఎక్కడ వెంచర్లు వేసినా రోజాకు నాలుగు ప్లాట్లు, నగదు ఇవ్వాల్సిందేనని ఆరోపణలున్నాయి. లేదంటే బెదిరింపులు వెళ్లాయి. వెంచర్లకు అనుమతులు రావు.

వసూల్ రాజాలు.. ఆ సోదరులు

ఎమ్మెల్యేకు ఇద్దరు సోదరులున్నారు. ఆయా మామూళ్ల వసూళ్లలో ఈ ఇద్దరిదే కీలకపాత్ర అని అంతా చెబుతుంటారు.

● ఓ మండలంలో బినామీ పేర్లతో గ్రావెల్ క్వారీలను వీరు నడిపిస్తున్నారు. చివరికి ఇటుక బట్టీలకు మట్టి తోలుకునే వారు కూడా ఎమ్మెల్యే సోదరులకు ముడుపులు ఇవ్వాల్సిందేనంటారు. వసూళ్ల కోసం ప్రత్యేక ఏజెంట్లను నియమించుకున్నారని చెబుతారు.

● ఈ ప్రాంతంలో తహసీల్దార్‌గా పనిచేయాలంటే కచ్చితంగా ఎమ్మెల్యే సోదరులను సంతృప్తి పరచాల్సిందే అని ప్రచారంలో ఉంది. సీఐలు సహా ఇతర అధికారులు ఎవరైనా ఇక్కడ పనిచేయాలంటే స్థాయిని బట్టి రేటు ఇచ్చుకోవాల్సిందేనని చెబుతారు. ఏ మాత్రం మాట వినకున్నా జిల్లా అధికారులకు చెప్పి వెంటనే బదిలీ చేయించేస్తారని ప్రచారం. ● మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇస్తానని ఆశ చూపి రోజా సోదరుడు రూ.50 లక్షలు తీసుకున్నట్టు పుత్తూరు కౌన్సిలర్ భువనేశ్వరి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆధారాలతో సహా ఆరోపణలు చేశారు.

● పుత్తూరులోని కార్వేటినగరం సర్కిల్ వద్దనున్న కోనేరు పునరుద్ధరణ పేరుతో దాన్ని చిన్నదిగా చేసేసి చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఒక్కో షాపు వద్ద రూ.8 లక్షలు చొప్పున 32 షాపుల వద్ద నుంచి వసూలు చేశారని రోజా అనుచరులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. వసూలు చేసిన వైసీపీ నేత రూ.25 లక్షలు ఆమె ట్రస్టుకు ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. హైకోర్టు స్టే ఇవ్వడంతో ఈ నిర్మాణం ఆగిపోయింది.

జనసేన కార్యకర్తపై వైసీపీ జడ్పీటీసీ దాడి


రామచంద్రను పరామర్శిస్తున్న నేతలు

కుప్పం, మే 7: ప్రతిపక్ష నేత చంద్రబాబు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులపై అధికార పార్టీ నేతల దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. గుడుపల్లె మండలం వెంకటాపురం గ్రామంలో ప్రచారం చేస్తున్న జనసేన కార్యకర్త రామచంద్రపై ఆ మండలానికి చెందిన వైసీపీ జడ్పీటీసీ కృష్ణమూర్తి దాడి చేశాడు. ప్రచారం చేయడమే నేరంగా రామచంద్రను కృష్ణమూర్తి నిలదీశారు. బదులు మాట్లానివ్వకుండా కొట్టి గాయపరిచాడు. జనసేన కార్యకర్తలు ఆయన్ను కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రామచంద్రను మంగళవారం టీడీపీ, జనసేన నాయకులు పరామర్శించారు. బాధితుడు గుడుపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

23 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 7: జిల్లాలో పలుచోట్ల సోమవారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. కొన్ని చోట్ల ఈదురుగాలుల కారణంగా చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పంటలకు నష్టం వాటిల్లింది. సోమవారం ఉదయం 8 నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకు 23 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. పలమనేరులో 57.2మి.మీ, గంగవరం 55.4, బైరెడ్డిపల్లి 45.2, సోమల 40.4, ఐరాల 40.2, సదుం 39.8, పులిచెర్ల 35.2, తవణంపల్లె 33.6, పెద్దపంజాణి 29.8, రొంపిచెర్ల 29.2, చౌడేపల్లి 28.6, బంగారుపాళెం25.0, గుడుపల్లి 20.6, పుంగనూరు 20.4, కుప్పం 19.2, రామకుప్పం 18.4, వి.కోట 17.2, యాదమరి 14.8, శాంతిపురం 10.2, చిత్తూరు 3.2, పెనుమూరు 3.0, గంగాధరనెల్లూరు 2.0, వెదురుకుప్పంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

పెద్దిరెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలి

ఎన్నికల అఫిడవిట్‌లో 142 ఆస్తులను చూపలేదు

ఈసీకి రామచంద్రయాదవ్ ఫిర్యాదు

పుంగనూరు, మే 7 : ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో 142 ఆస్తుల వివరాలు వెల్లడించని పుంగనూరు వైసీపీ అభ్యర్థి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుడిగా ప్రకటించాలని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను ఆ పార్టీ ప్రతినిధులు కలిసి ఫిర్యాదు చేశారు. పుంగనూరు వైసీపీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి, ఆయన భార్య స్వర్ణలతకు సంబంధించి నేరపూర్వచరిత్ర, ఆస్తులు, అప్పులు, విద్యార్హత తదితర వివరాలన్నీ నామినేషన్ అఫిడవిట్‌లో పొందుపరిచి ఎన్నికల అధికారి ముందు ప్రమాణం చేసి కూడా వారి ఆస్తుల వివరాలను బహిర్గతం చేయకుండా మోసం చేశారన్నారు.పుంగనూరు, పులిచెర్ల, మదనపల్లె, ఏర్పేడు మండలాలతోపాటు తిరుచానూరులోని 142 ఆస్తులను వెల్లడించకుండా తప్పుడు సమాచారం అందించారని తెలిపారు.పెద్దిరెడ్డిని ప్రాసిక్యూట్ చేసి ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలని ఆస్తుల వివరాలతో రామచంద్రయాదవ్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు : దగ్గుమళ్ల

వైసీపీ డ్రామాలను ప్రజలు నమ్మరు - పోస్టల్ బ్యాలెట్ ట్రెండ్ ఈ ఎన్నికల్లో కొనసాగుతుంది


ప్రచారంలో ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, డాక్టర్ థామస్

శ్రీరంగరాజపురం, మే 7: వైసీపీ ప్రభుత్వ నియంతృత్వ పోకడలతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. వైసీపీ డ్రామాలను వారు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. మంగళవారం చిత్తూరు వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సొంత గ్రామ పంచాయతీ 49.కొత్తపల్లె గ్రామ పంచాయతీలో జీడీనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్, మండలాధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, సూరిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్, బీజేపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ట్రెండే రాబోయే సార్వత్రిక ఎన్నికల్లోనూ కొనసాగుతుందన్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని, ప్రజలను మభ్య పెట్టాలని వైసీపీ కుయుక్తులు పన్నుతోందని, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ రోజున ఆ పార్టీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి నిరసన ప్రదర్శనే ఇందుకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఎన్డీఏ కూటమిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా యువత టీడీపీ పాలన కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తోందన్నారు. ప్రజా కోర్టులో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. ఇప్పటికే ప్రజాదరణ పొందిన టీడీపీ గెలుపు తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గీర్వాణీ చంద్రప్రకాష్, గురునాథం, యోగి నాయుడు, జీవన్ కుమార్, సతీష్, సాయి, హర్షవర్ధన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, అజిత్, కె.మునిరత్నం, నాయుడు, బాలకృష్ణ నాయుడు, లోకేష్, ప్రేమకుమార్, స్టాలిన్, బోడపాటి లోకనాథం నాయుడు, రాజశేఖర్ నాయుడు, సిద్ధయ్యశెట్టి, నిరంజన్‌రెడ్డి, హేమాద్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


చిత్తూరులో ప్రచారం చేస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

జనాదరణే కూటమి బలం

చిత్తూరు సిటీ: జనాదరణే కూటమి పార్టీల బలమని చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. మంగళవారం నగరంలోని 33, 34 డివిజన్లు, లాయర్స్ కాలనీలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలతో కలసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించి ఉమ్మడి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు బాబురెడ్డి, కేశవన్ నాయుడు, చరణ్ కుమార్, శివకుమార్, రామ్మూర్తి నాయుడు, భూపాల్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి.. నేడు ఆఖరి రోజు

చిత్తూరు కలెక్టరేట్, మే 7: చిత్తూరు కలెక్టరేట్‌తోపాటు మిగిలిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో మూడో రోజైన మంగళవారం కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ జరిగింది. మండుటెండలో సైతం ప్రభుత్వ ఉద్యోగులు వచ్చి పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకున్నారు. ప్రతి సెంటర్‌లోనూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పలుచగా హాజరుకావడం కనిపించింది. జిల్లాలో పనిచేస్తున్న ఇతర జిల్లాల ఉద్యోగులు 4,034 మంది ఉండగా, వారిలో మంగళవారం వరకు 2,941 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్నారు. ఈ మూడ్రోజుల్లో 10,827మంది పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్నారు. అత్యవసర సర్వీసుల్లోని ఉద్యోగులు 4,061 మంది ఉండగా వారిలో ఇంతవరకు 2,735 మంది వినియోగించుకున్నారు.

హోం ఓటింగ్ పూర్తి


చిత్తూరు కలెక్టరేట్, మే 7: వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటువేసే కార్యక్రమం మంగళవారంతో పూర్తయ్యింది. జిల్లావ్యాప్తంగా సోమవారం 75శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా, మంగళవారం పలుచగా ఓటింగ్ జరిగింది. ఇందుకోసం ఏర్పాటు చేసిన బృందాలు హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్ల వద్దకే బాక్సును తీసుకెళ్లి రహస్య ఓటింగ్ జరిపారు. జిల్లాలో మొత్తం 566 మంది ఓటర్లు ఉండగా, మంగళవారం వరకు 444 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో వృద్ధులు 188 మంది, దివ్యాంగులు 256 మంది ఉన్నారు. వృద్ధులు పుంగనూరులో 25, నగరి 47, గంగాధరనెల్లూరు 06, చిత్తూరు 35, పూతలపట్టు 9, పలమనేరు 21, కుప్పం 45మంది సద్వినియోగం చేసుకున్నారు. దివ్యాంగులు పుంగనూరులో 32, నగరి 44, గంగాధరనెల్లూరు 23, చిత్తూరు 35, పూతలపట్టు 34, పలమనేరు 16, కుప్పంలో 72మంది వినియోగించుకున్నారు. కొన్నిచోట్ల బుధవారం కూడా పోలింగ్ చేపట్టనున్నారు.

కుప్పం సబ్ రిజిస్ట్రార్‌కు రిమాండ్

కుప్పం,మే7:లంచం తీసుకుంటూ పట్టుబడ్డ కుప్పం సబ్ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్యను, జూనియర్ అసిస్టెంట్ మోహన్‌బాబును, డాక్యుమెంట్ రైటర్ షణ్ముగాన్ని రిమాండ్‌కు తరలించారు. 1.60 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ కోసం కుప్పం పట్టణానికి చెందిన షణ్ముగం వాణి నుంచి రూ.25 వేలు లంచం తీసుకుంటూ సోమవారం వీరు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. మంగళవారందాకా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు ముగ్గురు నిందితుల ఇళ్లలోనూ ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. తర్వాత రిమాండ్‌కు తరలించారు.

రూ.43.12లక్షల కర్ణాటక మద్యం స్వాధీనం

ముగ్గురి అరెస్టు - ఐదుగురిపై కేసు నమోదు


మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

బంగారుపాళ్యం, మే 7: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ లక్ష్మయ్య తెలిపారు. ముగ్గురిని అరెస్టు చేయగా, మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని మహాసముద్రం టోల్ ప్లాజా వద్ద మంగళవారం ఉదయం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. బెంగళూరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కేఏ51 ఏహెచ్0349 కంటైనర్‌ను తనిఖీ చేయగా రూ.43,12,224 విలువ చేసే 713 బాక్సుల్లో 34,224 బాటిళ్ల కర్ణాటక మద్యం దొరికింది. కంటైనర్, కారు, ద్విచక్ర వాహనం సహా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బంగారుపాళ్యం మండలం చీకురుపల్లికి చెందిన దిలీప్‌కుమార్, తిరువణ్ణామలైకి చెందిన లారీ డ్రైవర్ శేఖర్ మునియప్ప, తిరుపతి యాదవ కాలనీకి చెందిన నామాల మునికేశవ అలియాస్ కిరణ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. బంగారుపాళ్యం మండలం పావని వాండ్లపూరుకు చెందిన గంటా భాస్కర్, కుప్పానికి చెందిన శ్రీనివాస్, బెంగళూరుకు చెందిన ఎమ్మార్పీ ఓనర్, ఎమ్మార్పీ క్యాషియర్ సంజయ్, మద్యం అందించిన షాపు ఓనర్లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


ప్రజాగళం
ఎన్డీఏతో వికసిత ఆంధ్ర - వికసిత భారత్
గౌ॥ ప్రధాన మంత్రి
శ్రీ నరేంద్ర మోదీ గారికి
స్వాగతం
సుస్వాగతం
స్థలం : కలికిరి, అన్నమయ్య జిల్లా
తేది : 08-05-2024, సా॥ 3.00 గం॥కు
శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి
రాజంపేట పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థి

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఇదీ పెద్దిరెడ్డి అవినీతి లెక్క: కిరణ్




ప్రసంగిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, గులకరాయి డ్రామా అంటూ ప్లాస్టర్‌తో ఇలా..

పుంగనూరు: ఇసుక, ఖనిజం కాకుండానే పుంగనూరు ప్రజల నుంచీ వివిధ రూపాల్లో రూ.1500 కోట్లను పెద్దిరెడ్డి దోపిడీ చేశారని మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కిరణ్‌కమార్‌రెడ్డి అన్నారు. పుంగనూరులో మంగళవారం సాయంత్రం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 'శివశక్తి డెయిరీ ద్వారా రైతుల నుంచి రోజుకు రూ.9 లక్షల కమీషను చొప్పున ఏడాదికి రూ.33 కోట్లు.. ఐదేళ్లలో రూ.132 కోట్లు దోచేశారు. మామిడి రైతులకు ఇక్కడ మద్దతు ధర ఇవ్వలేదు. మామిడి రైతుల నుంచి ఏటా రూ.150 కోట్ల కమీషన్ తీసుకుంటున్నారు. మూడు ప్రాజెక్టులను మొదలుపెట్టి రైతులకు చెందిన 1500 ఎకరాలను తీసుకుని ఒక్క రూపాయి కూడా పరిహారం ఇవ్వలేదు. రూ.670 కోట్లను రైతులకు నష్టం చేశారు. ప్రాజెక్టులకు అనుమతులు తీసుకోకుండా గ్రీన్ ట్రిబ్యునల్‌కు రూ.వంద కోట్లు జరిమానా కట్టారు.

వెబ్ కాస్టింగ్‌తో ధైర్యంగా ఓటేయండి

'స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా దౌర్జన్యం చేసి ఆయా స్థానాలను పెద్దిరెడ్డి లాక్కున్నాడు. ఇప్పుడు నియోకవర్గంలోని 266 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు పెట్టారు. ప్రతిదీ రికార్డు అవుతుంది. ఎక్కడైనా గొడవ జరిగితే వెంటనే సీఆర్‌పీఎఫ్ పోలీసులు వచ్చేస్తారు. మీరంతా ధైర్యంగా ఓటేయొచ్చు. ఇదంతా తెలిసి భయంతో ఇప్పుడొచ్చి పెద్దిరెడ్డి ఓట్లు అడుగుతున్నారు' అని కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పుంగనూరులో పెద్దిరెడ్డిని ఓడించడం ఖాయమన్నారు. ప్రజలు పొరబాటు చేయకుండా అసెంబ్లీకి టీడీపీకి, ఎంపీగా కమలం గుర్తుకు ఓట్లు వేసి తనను, కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో పెద్దిరెడ్డి ఆటలు సాగవని, పుంగనూరు సభకు వచ్చిన జనాలను చూసి పెద్దిరెడ్డికి నిద్ర రాదన్నారు. ఈ సభలో టీడీపీ మాజీ ఇన్‌చార్జి ఎం.వెంకటరమణరాజు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మాజీ డీఎస్పీ సుకుమార్‌బాబు, ఆర్బీటీ బాబు, సుహేల్‌బాషా, శ్రీకాంత్, సుబ్రహ్మణ్యంరాజు, దినేశ్, రామనాథంనాయుడు, శ్రీనివాసులునాయుడు, మాధవరెడ్డి, రెడ్డెప్పనాయుడు, మధన్‌మోహన్, నానబాల కుమార్, చిన్నారాయులు, పగడాల రమణ, విరుపాక్షి తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరికి అడుగడుగునా నీరాజనం



శాంతిపురం, మే 7: కుప్పం పర్యటనకు విచ్చేసిన చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరికి రాష్ట్ర సరిహద్దులోని బెల్లకోగిల వద్ద మంగళవారం సాయంత్రం 7.30 గంటలకు టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఆపై ఆమె బెల్లకోగిల ఎస్సీ కాలనీ, అరెకెర క్రాస్, రేగడదిన్నే పల్లె, సోగడబల్ల, బోయినపల్లె గ్రామాల మీదుగా రోడ్‌షో నిర్వహించారు. ఎన్నికల నియమావళి మేరకు రాత్రి పది గంటల సమయంలో ప్రసంగాలు ఆపి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పది దాటినా ప్రజలు ఏమాత్రం చెక్కుచెదరకుండా వేచి ఉన్నారు. పలుచోట్ల భువనేశ్వరి మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు గంజాయి, డ్రగ్స్, కల్తీమద్యం, ఇసుక, మట్టి.. ఇలా ఏది దొరికితే దాన్ని అడ్డంగా దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. వీటిని ప్రశ్నించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలపై ఐదేళ్లుగా కక్షసాధింపు చర్యలు, దాడులు, హత్యలకు తెగబడుతున్నారన్నారు. అధిక ధరలు, అనేక సమస్యలతో నలిగిపోతున్నా ప్రశ్నించే పరిస్థితి రాష్ట్రంలో లేదన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న చంద్రబాబు, లోకేశ్‌పైనా తప్పుడు కేసులతో ప్రభుత్వం వేధిస్తోందన్నారు. సైకిల్ స్పీడును మరింతగా పెంచి అడ్డొచ్చిన వారిని తొక్కుకుంటూ దూసుకుపోవాలని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పరచేవరకు విశ్రమించకూడదన్నారు. ఆమెతో పాటు సోదరుడు నందమూరి రామకృష్ణ ఉన్నారు. ఈ ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కుప్పం ఇన్‌ఛార్జ్ పీ.ఎస్.మునిరత్నం, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నాయకులు ఉదయ్‌కుమార్, ఉయ్యాల జయరామిరెడ్డి, చలపతి, చంద్రశేఖర్, నాగరాజ్, పీవీ నాగరాజు, ఇతర నేతలు, కార్యకర్తలు ఉన్నారు. అనెకెర క్రాస్‌లో చిన్నారిదొడ్డి పంచాయతీ వార్డు సభ్యుడు లోకేష్, జగపతి, ప్రసాద్ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

టీడీపీ విజయంతోనే కుప్పం అభివృద్ధి

కుప్పం, మే 7: తెలుగుదేశం అధికారంలోకి వస్తేనే కుప్పం నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్ అన్నారు. పురపాలక సంఘంలోని 24వ వార్డు పరిధి విజయలక్ష్మి రోడ్డు, 3వ వార్డులోని బరుగానిపల్లెల్లో మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు.

టీడీపీతోనే నవ్యాంధ్ర అభివృద్ధి సాధ్యం

రామకుప్పం, మే 7: నవ్యాంధ్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, తెలుగురైతు నియోకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ కోరారు. మంగళవారం వారు మండల పరిధిలోని పలు గ్రామాల్లో చంద్రబాబు తరపున ఇంటింటి ప్రచారం చేశారు.

చంద్రబాబుతోనే పల్లెల ప్రగతిబాట : గౌనివారి



శివరామపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గౌనివారి శ్రీనివాసులు తదితరులు

శాంతిపురం, మే 7 : చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. మంగళ వారం శివరామపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 13న జరిగే ఎన్నికల్లో చంద్రబాబును లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. ● శాంతి పురంలో జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా పంచాయతీ నాయకులు ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, ఏఎంసీ నాగరాజు, ప్రధాన కార్యదర్శి పీవీ.నాగరాజు, యూనిట్ ఇన్‌చార్జిలు, ఆర్ఎస్ మణి, గోపాల్, రుద్రప్ప, రమేష్‌రెడ్డి, ఎల్.జయారెడ్డి, మహిళ నేతలు శ్యామల, హేమావతి, తదితరులు పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్ ప్రశాంతం



ఇంట్లో ఓటుహక్కు వినియోగించుకుంటున్న విభిన్న ప్రతిభావంతుడు హరికృష్ణ

గంగవరం, మే 7: గంగవరం మండలంలోని రొంటకుంట్ల పాతూరు గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతులు వి.హరికృష్ణ, ఎ.సుబ్బమ్మ, శ్రీరాములు (85) వృద్ధాప్యంతో హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేస్తున్నారు. మండల ఎన్నికల అధికారి ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, హనుమంతరావు ఆధ్వర్యంలో ఓటర్ల ఇళ్ల వద్దే ఓటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. దీంతో వారు ఓట్లు వేశారు. ఇంటి వద్ద ఓటింగ్ తమలాంటి వారికి ఎంతో సౌకర్యంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

యూనివర్సిటీ టాపర్లుగా మదర్‌థెరిసా విద్యార్థినులు

గంగవరం, మే 7: డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో మదర్‌థెరిసా విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎస్.వి.యూనివర్శిటీ టాపర్లుగా నిలిచారని కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో బీబీఏలో ఎం.జ్యోతి (9.53), చరితారెడ్డి (9.48), యస్.ఆయేషఫిర్దౌస్ (9.13), బీ.కామ్‌లో యస్.తేజశ్రీ (9.32), సి.భావన (9.09), ఎం.దీప్తి(9.08), యం.లహరి (9.06), బీఎస్సీలో బి.బిందు(9.24), డీజీ.అఖిల(9.13), జి.కళ్యాణి(9.07), ఎస్.కుసుమ(9.01), ఆర్.గాయత్రి (9.00) బీసీఏలో రేష్మ (8.97), టి.మమత (8.95), అత్యుత్తమ మార్కులు సాధించారని వివరించారు. మొత్తం మీద 231 డిస్టింక్షన్లు, 116 మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ఛైర్మన్ సునీల్ అభినందించారు.

88.58శాతం పోలింగ్

పుంగనూరు రూరల్, మే7: పుంగనూరు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 88.58శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పోస్టల్‌బ్యాలెట్ ఓటర్లు మొత్తం 2425 మందికిగాను 2148 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు. అలాగే హోంఓటర్లు 93.44శాతం ఓటు హక్కు వినియోగించుకున్నట్లు వెల్లడించారు.

టీడీపీ నాయకుడికి నివాళి

బైరెడ్డిపల్లె, మే 7 : మండలంలోని గడ్డూరు పంచాయతీ టీడీపీ సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి సోమవారం రాత్రి మృతిచెందారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి మంగళవారం ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు.

నందిపై శివపార్వతుల చిద్విలాసం

సోమల, మే 7: సోమల స్వయంబేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలలో భాగంగా మంగళవారం శివపార్వతుల ఉత్సవ మూర్తులు నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. ఇంటింటా మహిళలు కర్పూర నీరాజనాలు పలికారు. స్వామివార్ల కల్యాణోత్సవ ఉభయదారులుగా శెట్టివారి నాగరాజ, దీప దంపతులు వ్యవహరించారు. అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త సోమశేఖర్, లింగయ్య, శంకర్‌రెడ్డి, వీవీ రమణ, రామసిద్ధులు, సోమశేఖర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వేడుకగా గంగచాటు



పలమనేరు, మే7 : పలమనేరులో ఈనెల 20 ,21, 22 తేదీల్లో నిర్వ హించే గంగమ్మ జాతర కోసం మంగళవారం రాత్రి గంగచాటును భక్తి శ్రద్ధలతో నిర్వహిం చారు. ఈ సందర్భంగా గ్రామ ఆనవాయితీ మేరకు గుండుబావి వద్ద అమ్మవారి పూల శిరస్సును గంగమ్మ ఆలయం వద్దకు వేడుకగా తీసుకొచ్చారు. అక్కడ ఆలయం లో పూలశిరస్సును అలంకరించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి కమలాకర్, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

గాలివానకు మేకలు, ఆవు మృతి



కుప్పం రూరల్, మే 7: కుప్పం మండలంలోని నూలుకుంట గ్రామంలో సోమవారం కురిసిన గాలివానకు సయ్యద్ బాషా అనే మేకల కాపరి పశువుల కొట్టం పూర్తిగా కూలిపోయింది. కొట్టంలోని నాలుగు మేకలు, ఒక ఆవు, కోళ్లు మృతి చెందాయి. తనను ప్రభుత్వం ఆదుకోవాలని సయ్యద్ బాషా కోరుతున్నాడు.

స్ట్రాంగ్ రూంల పరిశీలన

పలమనేరు, మే7 : ఎన్నికల అనంతరం ఈవీఎంలను భద్రపరిచేందుకు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలను మంగళవారం కలెక్టర్ షన్మోహన్ పరిశీలించారు. స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రత ఏర్పాట్లను పలమనేరు ఎన్నికల అధికారి మనోజ్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు
- రాత్రంతా అంధకారం
- పలుచోట్ల నేల రాలిన మామిడి
- అరటి, టమోటా పంటలకు నష్టం




సోమల మండలంలో నేల వాలిన టమోటా తోటలు, బైరెడ్డిపల్లె మండలం నాచుకుప్పంలో ధ్వంసమైన అరటితోట

పలమనేరు, మే7 : పలమనేరులో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల చెట్లు నేలకూలి విద్యుత్ తీగలపై పడటంతో పలమనేరులోను, పలమనేరు గ్రామీణ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. పలమనేరు ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పంచాయతీ రాజ్ కార్యాలయం ఆవరణలో ఉన్న చెట్టు కూలడంతో ఆవరణలో నిలిపి ఉన్న రెండు ద్విచక్రవాహనాలు దెబ్బతిన్నాయి. మర్కస్ కాంప్లెక్సు వద్ద ఒక చెట్టుకూలడంతో ముందున్న షెల్టర్ పాక్షికంగా దెబ్బతింది. అటవీ కార్యాలయం వద్ద ఒక భారీవృక్షం విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. క్రాస్ రోడ్డు విద్యుత్ స్తంం వాలిపోయింది. శీనగర్ కాలనీకి వెళ్లే మార్గంలో ఓ కొయ్యల మండీపైన రేకులు ఎగిరి రోడ్డుపై వచ్చి పడ్డాయి. మండీపేట కోటూరు గ్రామసమీపంలో మూడు, సముద్రపల్లి గ్రామసమీపంలో నాలుగు, పెంగరగుంట- తవడపల్లి గ్రామాల మధ్యమూడు, సాకేవూరు గ్రామం వద్ద నాలుగు, గంగారుపూర్ వద్ద ఒక విద్యుత్ స్తంభం నేలకొరిగిపోయాయి. వీటిలో పలు స్తంభాలు విరిగిపోయాయి. ఇక ఐదు వ్యవసాయ ట్రాన్స్‌ఫారాలు కూలిపోయాయని, నాగమంగళం వద్ద భారీవృక్షం పైన పడడంతో ట్రాన్స్‌ఫారం కిందపడిపోయింది.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ :

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు యుద ప్రాతిపదికన చేస్తున్నట్లు పలమనేరు ఏడీఈ చిన్నబ్బ తెలిపారు. దాదాపు రూ.10 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు.

మామిడి, వరి పంటలకు నష్టం

వానాగాలికి మామిడి, వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అసలే మామిడిలో కాపు తక్కువగా ఉంది. ఈ పరిస్థితిలో ఉన్నకాపులోనూ 60 శాతం మామిడి కాయలు రాలిపోయాయి. ముసలిమడుగు, పెంగరగుంట, కాలువపల్లి, మండీపేటకోటూరు తదితర ప్రాంతాల్లో మామిడి కాయలు విపరీతంగా రాలిపోయాయి. ఇక కోతకొచ్చిన వరి పైర్లు చాలావరకు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దెబ్బతిన్న పంటలు

బైరెడ్డిపల్లె: మండలంలో సోమవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి పలు చెట్లు నేలకూలాయి. పలు పంటలు దెబ్బతిన్నాయి. నాచుకుప్పం గ్రామంలో రైతు ప్రకాశ్‌రెడ్డికి చెందిన రెండున్నర ఎకరాల్లో అరటితోట దెబ్బతింది. దాదాపు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లింది. బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాల వద్ద రెండు చెట్లు నేలకూలాయి. లక్కనపల్లె, కడపనత్తం, దేవదొడ్డి తదితర ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. పలుచోట్ల మామిడి తోటల్లో కాయలు రాలిపోయాయి. టమోట, బీర, బీన్స్ తదితర పంటలు దెబ్బతిన్నాయి. కాగా బైరెడ్డిపల్లె సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి విద్యుత్ సరఫరా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. పెద్దపురం సబ్‌స్టేషన్ పరిధిలోనూ 24గంటలుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

దెబ్బతిన్న మామిడి..టమోటా

సోమల: మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో టమోటా, మామిడి పంటకు భారీ నష్టం వాటిల్లింది. ఈదురు గాలులుతో సోమల - సదుం మార్గంలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద భారీ తైలం వృక్షాలు విద్యుత్ లైన్‌పై పడ్డాయి. తీగలు తెగిపోవడంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం జరిగింది. ఈ మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. సోమల, పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, ఇరికిపెంట తదితర ప్రాంతాల్లో పలు ఇళ్ల పైకప్పులు దెబ్బతిన్నాయి. మామిడి, టమోటా, అరటి తోటలు దెబ్బ తిన్నాయి. మామిడి కాయలు నేల రాలడంతో రైతులు వాటిని మార్కెట్‌కు తరలించగా వ్యాపారస్తులు కిలో రూ.5 వంతున కొనుగోలు చేశారు. పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు వాటిని పునరుద్ధరించారు.



పలమనేరు పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద వాహనాలపై విరిగి పడని చెట్టు కొమ్మలు



పలమనేరు అటవీ అతిథిగృహం వద్ద విద్యుత్ తీగలపై కూలిన వృక్షం



పలమనేరులో విద్యుత్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది






సోమలలో నేల రాలిన మామిడిని మార్కెట్‌కు తరలించిన దృశ్యం, పెంగరగుంట వద్ద కూలిపోయిన విద్యుత్ స్తంభం, వడ్డూరు వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై వాలిపోయిన విద్యుత్ స్తంభం, సదుం మండలం పొట్టెంవారిపల్లెలో నేలరాలిని మామిడి కాయలు

ఈదురు గాలులతో నేల రాలిన మామిడి

సదుం, మే 7: మండల పరిధిలో సోమవారం రాత్రి వీచిన పెనుగాలుల తీవ్రతకు పలుచోట్ల మామిడి పంట నేలరాలింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసి ఎండ తీవ్రత నుంచి కొంత ఉపశమనం కలిగినా, ఈదురు గాలులకు మామిడి చెట్లు కొమ్మలతో సహా కోతకొచ్చిన కాయలు నేల రాలిపోయాయి. అసలే ఈ ఏడాది పంట దిగుబడి చాలా తక్కువగా ఉందని, దానికి తోడుగా ఇలా పంట నేల రాలిందని వారు రైతులు వాపోయారు. గొంగివారిపల్లె, తిమ్మానాయునివారిపల్లె, అమ్మగారిపల్లె పంచాయతీలో పంట నష్టం ఎక్కువగా వాటిల్లింది. జరిగిన పంట నష్టంపై ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తా: మాజీ మంత్రి అమర్




టీడీపీలో చేరిన పి.ఒడ్డూరు గ్రామస్తులు, పెద్దపంజాణిలో మాట్లాడుతున్న అమరనాథరెడ్డి సతీమణి రేణుకారెడ్డి

పలమనేరు, మే7 : పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పెన్షనర్లకు హామీ ఇచ్చారు. మంగళవారం పలమనేరు పెన్షనర్ల భవనంలో జరిగిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో సామాన్య ప్రజలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు సైతం బాధితులు కావడం బాధాకరమన్నారు. ప్రభుత్వాన్ని అదనపు ప్రయోజనాలు డిమాండు చేసే పరిస్థితి నుంచి 'రావాల్సిన బెనిఫిట్స్ ఇస్తేచాలు' అనే పరిస్థితికి పెన్షనర్లను తీసుకొచ్చిందన్నారు. అందువల్ల విజ్ఞులైన ప్రతిఒక్కరూ ఆలోచించి రాష్ట్ర భవిష్యత్తు కోసం తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ అధ్యక్షులు మనోహరరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటక్రిష్ణయ్య, ఉపాధ్యక్షులు గురుమూర్తి, రత్నాకరరెడ్డి, పలమనేరు పరిరక్షణ సమితి అధ్యక్షులు సుబ్ర మణ్యంపిళ్లై తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన ఒడ్డూరు గ్రామస్తులు

పి.ఒడ్డూరు పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ యువత టీడీపీ కార్యాలయంలో అమరనాథరెడ్డి సమక్షంలో పసుపు కండువాలు ధరించారు.

వి.కోట: వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ప్రమాదకరమైందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. ఖాజీపేట, అనంతాపురం, కమ్మేపల్లె, కుంబార్లపల్లె, తోటకనుమ గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. ● వి.కోట పట్టణ పరిధిలో టీడీపీ నేతలు ముమ్మర ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బన్న, శబరీష్, ధీరజ్, జనార్ధన్‌రెడ్డి, సతీష్, మంజునాథ్, తదితరులు ఉన్నారు.

పెద్దపంజాణి: మాజీ మంత్రి అమరనాథరెడ్డి సతీమణి రేణుకారెడ్డి నేలపల్లె, కత్తార్లపల్లె వద్ద మండలంలోని మహిళలతో సమావేశం నిర్వహించారు. టీడీపీని గెలిపించాలని కోరారు.

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం, పెద్దచెల్లార గుంట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సైకిల్‌గుర్తుకు ఓట్లేయాలని కోరారు.

నారా భువనేశ్వరి పర్యటనను జయప్రదం చేయండి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రామకుప్పం, మే 7: నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ తెలిపారు. మంగళవారం వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. బుధవారం ఉదయం 9గంటలకు రామకుప్పం నుంచి ప్రారంభమయ్యే అమె పర్యటన బందార్లపల్లె, పెద్దగెరిగెపల్లె, పల్లికుప్పం, పంద్యాలమడుగు, పీఎంకేతాండా, ననియాల, 89పెద్దూరు, ఆరిమానిపెంట, వీర్నమలబల్ల, పెద్దకురబలపల్లెల మీదుగా గోవిందపల్లె వరకు సాగుతుందని తెలిపారు. పార్టీ అన్ని విభాగాల నేతలు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పర్యటనను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు రామ్మూర్తి, రామకృష్ణప్ప, మహ్మద్‌రఫీ, విశ్వనాథ్, వెంకటాచలం, మనోహర్, కామరాజనాయక్, సత్తి, జయశంకర్, పెరుమాళ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యంలో పురుగులు




బియ్యంలో పురుగులు, బస్తాలో పురుగుల గూళ్లు

రామకుప్పం, మే 7: గత ఎన్నికల సమయంలో వైసీపీ పెద్దలు ఊదరగొట్టినట్లు రేషన్ షాపుల్లో సన్నబియ్యం అందుతుందో లేదో గానీ తరచూ ప్లాస్టిక్ బియ్యం, పురుగులు గూళ్లు కట్టిన బియ్యాన్ని అంటగడుతున్నారు. మంగళవారం రామకుప్పంలో పంపిణీ చేసిన బియ్యంలో పెద్దసంఖ్యలో పురుగులు కనిపించాయి. సంచుల్లో పురుగులు కట్టిన గూళ్లు కన్పించాయి. వీటిని చూసి కార్డుదారులు అవాక్కయినా చేసేది లేక తీసుకెళ్లారు.

ల్యాండ్ టైటిల్ యాక్టుతో భూహక్కు కోల్పోతాం

కుప్పం, మే 7: జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల భూ హక్కుకు ఉరి పడుతుందని టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా కుప్పంలోని ఆర్టీసీ బస్టాండు కూడలిలో గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా మన భూమి వేరేవారి పేర్లతో రిజిస్ట్రేషన్ అయినా, ఆన్‌లైన్లో మారినా కనీసం కోర్టుకు వెళ్లి న్యాయం కోరే హక్కు కోల్పోతామన్నారు. అంటే భూమి మనది, హక్కు మాత్రం ప్రభుత్వానిది అయిపోతుందని హెచ్చరించారు. రైతును బికారి చేసే ఈ మోసపూరితమైన చట్టం వద్దని నినదించారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు.

వి.కోట, మే 7: ల్యాండ్ టైటిల్ యాక్టుతో రైతులు తమ భూములపై హక్కును కోల్పోతారని టీడీపీ నాయకులు హెచ్చరించారు. ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దుచేయాలని మంగళవారం రెవిన్యూ కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భూములను కొట్టేయాలన్న ఉద్దేశంతో వైసీపీ ప్రభుత్వం జీవో నెంబరు 512ను తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా భూమికి సంబంధించిన సమస్య వస్తే కోర్టులకు వెళ్లే అవకాశం ఉండదని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఈ జీవోను రద్దుచేస్తామని తెలియజేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, నాయకులు ఈశ్వర్, రాంబాబు, చౌడప్ప, సోము, రుహుల్లా, నాసీర్, విశ్వనాథ్, భక్తా, చిట్టిబాబు పాల్గొన్నారు.




ల్యాండ్ టైటిలింగ్ చట్టం ప్రతులను చింపివేస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

సచివాలయ ఉద్యోగులను రెండు గంటలు నిలబెట్టిన ఈఓపీఆర్డీ

రామకుప్పం, మే 7: రామకుప్పం గ్రామ సచివాలయ సిబ్బంది పట్ల ఈఓపీఆర్డీ వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. ఎన్నికల విధుల్లో ఉన్న సచివాలయ సిబ్బంది సోమవారం ఈఓపీఆర్డీ అనుమతితో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు కుప్పానికి వెళ్లారు. అయితే ఈఓపీఆర్డీ రాధాకృష్ణ సోమవారం మధ్యాహ్నం సచివాలయంలో సిబ్బంది ఎవరూ లేరంటూ ఫొటోలను స్థానిక పీఆర్ శాఖ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అంతేకాకుండా మంగళవారం ఉదయం వారందరికీ షోకాజ్ నోటీసులిస్తామని చెప్పి, 10 గంటలకల్లా ఎంపీడీవో కార్యాలయానికి రావాలని సమాచారమిచ్చారు. 10మంది సచివాలయ సిబ్బంది ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఈఓపీఆర్డీ వారిని సుమారు 2గంటల సేపు నిలబెట్టి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఓటుహక్కు వినియోగించుకునేందుకు వెళ్లామని చెబుతున్నా వినిపించుకోలేదు. కాగా, సాయంత్రం 5 గంటల వరకు ఎవరూ ఎటువంటి విధులు చేయనవసరం లేదని, అప్పటి వరకు సమావేశ మందిరంలో కూర్చోవాలని ఎంపీడీవో ఈశ్వరన్ ఆదేశించారు. తాము గ్రామాల్లో ఓటర్లు స్లిప్పులు ఇవ్వాలంటూ వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయమై ఈఓపీఆర్డీని వివరణ కోరగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు సచివాలయ సిబ్బందికి తాను అనుమతి ఇచ్చానని, అయితే అందరూ ఒకేసారి వెళ్లడంపై మందలించానని అన్నారు. 2గంటల సేపు నిలబెట్టానని చెప్పడం అవాస్తవమన్నారు.

గంగమ్మ గుడి వద్ద అన్నదానం

పలమనేరు, మే7: పలమనేరు గంగమ్మగుడి వద్ద మంగళవారం మధ్యాహ్నం పేదలకు అన్నదానం చేశారు. గంగచాటు అనంతరం జాతర వరకు పట్టణంలోని వివిధ కులాలకు చెందిన కులసంఘాలు రోజుకొక్కరు చొప్పున అన్నదానం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం పలమనేరు శాలివాహన కుమ్మర్ల సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

నలుగురు వలంటీర్ల రాజీనామా

పాలసముద్రం : పాలసముద్రం సచివాలయంలో పనిచేసే నలుగురు వలంటీర్లు పంచాయతీ కార్యదర్శి ధరణీప్రసాద్‌కు తమ రాజీనామా లేఖలను అందజేశారు. 20 రోజుల క్రితం అదే సచివాలయానికి చెందిన ఓ వలంటీర్ రాజీనామా చేశారు.

గాలీవానకు మామిడి పంటకు తీవ్ర నష్టం



ఐరాలలో నేల రాలిన మామిడి కాయలు, కూలిన పనస చెట్టు

ఐరాల, మే 7: ఐరాల మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షం, గాలికి మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా చెట్లు కూలిపోయాయి. అసలే అరకొరగా ఉన్న మామిడి పంట నేల రాలడంతో మామిడి రైతులు దిగులుపడుతున్నారు నేల రాలిన మామిడి కాయలను కూలీలను పెట్టి ఏరి మండీలకు పోతే కూలి ఖర్చు సైతం రాదని చాల మంది మామిడి రైతులు నేల రాలిన కాయలను ఎత్త లేదు.

పీవీకేఎన్‌లో మాక్‌పోల్ నిర్వహణ

చిత్తూరు కలెక్టరేట్, మే 7: ఎన్నికల బరిలోని అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో మంగళవారం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో మాక్‌పోల్ జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈవీఎంలపై ఓటర్లలో ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. వీవీప్యాట్లన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించారు. ప్రతి పోలింగ్ బూత్‌కు సంబంధించి వెయ్యి ఓట్లు వేసిన స్లిప్పులను అభ్యర్థుల ఎదుట లెక్కించి, వారు సంతృప్తి పొందిన పిదప ఈవీఎంలో నుంచి వాటిని తొలగించారు. అభ్యర్థుల సమక్షంలో కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్లు ఖాళీచేసి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వోలు అరుణ, శ్రీనివాసులు, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు. సాయంత్రం బీఎల్వోలతో ఎన్నికల విధుల నిర్వహణపై సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ బీఎల్వోలు ముందస్తుగా పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ఇంటర్నెట్, మరుగుదొడ్లు, మౌళిక సదుపాయాలు వంటివి సక్రమంగా ఉన్నాయో లేదో ముందస్తుగా పరిశీలించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి

వెదురుకుప్పం, మే7: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబు కోరారు. మంగళవారం పచ్చికాపల్లంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబుతో కలసి పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చందురాణి, పార్టీ వెదురుకుప్పం మండల అధ్యక్షుడు కందుకూరి హుమేష్, ఓబీసీ చైర్మన్ చిరంజీవి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.జయచంద్ర, దాసురెడ్డి పాల్గొన్నారు.

నగరి కాంగ్రెస్ అభ్యర్థి ఇంటింటి ప్రచారం

నిండ్ర/నగరి, మే 7: మండల కేంద్రమైన నిండ్రలో మంగళవారం నగరి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాకేష్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి రెడ్డి, కేశవులు, రత్నం, నాగేశ్వరరావు, కుమార్, దివాకర్, గోపి, హరీష్ పాల్గొన్నారు. అలాగే నగరి పట్టణంలోని అనంతప్పనాయుడు కండ్రిగ, టీఆర్ కండ్రిగ, ఇందిరమ్మ కాలనీలలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాకేష్‌రెడ్డి ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబు, చిరంజీవిరెడ్డి, నాగేశ్వరరావు, రత్నం, కైలాసం, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల పార్టీ కాంగ్రెస్

బంగారుపాళ్యం, మే 7: బడుగు, బలహీనవర్గాల పార్టీ కాంగ్రెస్ అని పూతలపట్టు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.ఎస్ బాబు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని తగ్గువారిపల్లె, బంగారుపాళ్యంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధ్యక్షుడు లక్ష్మీప్రసన్న కుమార్, డీసీసీ మాజీ అధ్యక్షుడు రవీంద్ర నాయుడు, మాజీ ఎంపీపీ రవి, మైనార్టీ నాయకులు ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

చిత్తూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మే 7:చిత్తూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ చెప్పారు. మంగళవారం ఆయన నగరంలోని 2, 33, 34 డివిజన్ల పరిధిలోని మురకంబట్టు, గంగనపల్లె, కన్నయ్య నాయుడు కాలనీ, తేనెబండ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ళ ప్రసాదరావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత తదితరులు పాల్గొన్నారు. నగరంలోని 44, 47వ డివిజన్ల పరిధిలోని మార్కెట్ చౌక్, లెనిన్ నగర్ ప్రాంతాల్లో పార్టీ రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరితో కలసి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, ఆయన తనయుడు సీకే సాయికృష్ణారెడ్డి తదితరుల దుర్గానగర్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

డిప్యూటీ సీఎం వెన్నుపోటుదారుడు

- కాంగ్రెస్ అభ్యర్థి రమేష్‌బాబు

వెదురుకుప్పం, మే7: డిప్యూటీ సీఎం నారాయణ స్వామి వెన్నుపోటుదారుడు అని కాంగ్రెస్ పార్టీ గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్‌బాబు ఆరోపించారు. మంగళవారం ఆయన కార్వేటినగరం మండలం అన్నూరులో మీడియాతో మాట్లాడారు. తాను డిప్యూటీ సీఎం నారాయణస్వామికి మేనల్లుడని, ఆయన ఎదుగుదలకు తన తల్లిదండ్రులు రక్తాన్ని దారబోశారని, అటువంటి మా తండ్రిపై తప్పుడు కేసులుపెట్టి జైలుకు పంపిన చరిత్ర నారాయణస్వామిదే అని ఆరోపించారు సత్యవేడులో కారు కొనుగోలు కోసం తమపై బినామీ పత్రాలు సృష్టించి రూ.14లక్షల విలువగల ఇన్నోవా కారును కొనుగోలు చేయలేదా? అని ప్రశ్నించారు.

బ్రాహ్మణపల్లె ఘటనపై కేసు నమోదు

వెదురుకుప్పం, మే 7: బ్రాహ్మణపల్లెలో మంగళవారం జరిగిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు నగరి డీఎస్పీ కేఎస్‌మూర్తి తెలిపారు. ఓ యువకుడిపై మైనర్ ఒకరు కత్తితో దాడి చేయడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

పేదరికంలేని సమాజ స్థాపనే బాబు ధ్యేయం

మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్

బంగారుపాళ్యం, మే 7: పేదరికంలేని సమాజ స్థాపనే చంద్రబాబు నాయుడు ధ్యేయమని మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ అన్నారు. మంగళవారం మండలంలోని తూంపాయనపల్లి, తగ్గువారిపల్లె, కురప్పల్లి, నదకుప్పం, ఎర్రాండ్లపల్లి, తుంబపాళ్యం గ్రామాల్లో ఆయన ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ అభ్యర్థులైన దగ్గుమళ్ళ ప్రసాదరావు, మురళీమోహన్‌లను గెలిపించాలని కోరుతూ, సూపర్ సిక్స్ కరపత్రాలను పంచిపెట్టారు. అంతకుముందు నలగాంపల్లెకు చెందిన ఎన్ఆర్ఐ విక్రమ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఎన్ఆర్ఐ విక్రమ్ చేతుల మీదుగా బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్ర నాయుడు, ఎన్‌పీ ధరణి, లోకనాథం నాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, వెంకటాచలం నాయుడు, వినయ్, హేమచంద్ర నాయుడు, జనార్దన్ గౌడ్, చందు, నవీన్, నవీన్ చౌదరి, మాధవ నాయుడు, సూరి నాయుడు, రమేష్, నాసిర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



కుప్పపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎన్‌పీ జయప్రకాష్ తదితరులు

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

గొల్లమడుగు చెక్‌పోస్టు తనిఖీ

గుడిపాల, మే 7: చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలోని గొల్లమడుగు చెక్‌పోస్టును చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. ఎన్నికల తేది సమీపిస్తున్నందున చెక్‌పోస్టుల్లో పోలీసుల పనితీరుపై ఆరాతీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో తనిఖీ అధికారి గణపతి, ఏఎస్ఐ నాగరాజు, అధికారులు శ్రీహరి, ఎబినేషన్, చినతంబి తదితరులు పాల్గొన్నారు.

గురజాలపై తప్పుడు విమర్శలు తగవు

గుడిపాల, మే7: రాజకీయంగా ఎదుర్కోలేక చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం సబబు కాదని మండల బీజేపీ అధ్యక్షుడు ధనంజయ నాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఓటు అడగాలే తప్ప, కులాన్ని అడ్డుపెట్టుకుని ఓట్లు రాబట్టుకోవాలని చూడడాన్ని తప్పుపట్టారు.

ఇంటి వద్దే ఓటు

బంగారుపాళ్యం, మే 7: హోమ్ ఓటింగ్‌తో మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన మణి(70)అనే దివ్యాంగుడు ఇంటి వద్ద నుంచే తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు. మండలంలో 21 మంది హోమ్ ఓటింగ్‌కు నమోదు చేసుకున్నట్లు గెజిటెడ్ ఆఫీసర్ పార్థసారథి తెలిపారు. మైక్రో అబ్జర్వర్ వరుణ్‌తేజ్, ఆర్ఐ దీపక్ రెడ్డి, బీఎల్వోలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌ను విజయవంతం చేయండి

యాదమరి, మే 7: బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ రవిరాజు పిలుపునిచ్చారు. మంగళవారం యాదమరి పీహెచ్‌సీలో ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధిని అదుపు చేసేందుకు 18 సంవత్సరాల పైబడిన వారికి బీసీజీ వ్యాక్సినేషన్‌ను వేయించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చూడాల్సిన బాధ్యత ఆశవర్కర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో గణాంక అధికారి జార్జ్, జిల్లా విద్య, ఆరోగ్య అధికారి గుణశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నాను.

చంద్రబాబు సీఎం కావాలని పూజలు

శ్రీరంగరాజపురం, మే 7: నారా చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ఎస్ఆర్‌పురం మండలం సింధు రాజపురంలోని అభయాంజయస్వామికి మంగళవారం నారా గిరీష్, నారా ప్రతాప్‌నాయుడు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాలాజీ నాయుడు, బోడపాటి లోకనాథంనాయుడు, కేశవులునాయుడు, జయచంద్ర నాయుడు, బాబు, రాజగోపాల్ నాయుడు దుర్గ సముద్రం పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లు

నగరి మే7: స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ షన్మోహన్ నగరి ఆర్డీవో వెంకటరెడ్డికి సూచించారు. మంగళవారం నగరి డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లలో రూట్ నెంబరు వారీగా స్టిక్కర్లు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు కైలాష్ వాంగ్డే సైతం నగరి డిగ్రీకళాశాల వద్ద స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు.

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు కాణిపాకం సందర్శన

ఐరాల(కాణిపాకం), మే 7: కాణిపాకాన్ని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ భాస్కర్‌రావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయానికి సంబంధించిన వ్యర్థ పదార్థాల నిర్వహణను పరిశీలించారు. తొలత ఆయన వరసిద్ధుడిని దర్శించుకున్నారు. అనంతనం బాహుదానది ప్రాంతంతో పర్యటించారు. కార్యక్రమంలో జాయింట్ చీఫ్ ఇంజినీర్లు శ్రీరామమూర్తి, రాజశేఖర్, ఇంజినీర్ అశోక్, అసిస్టెంట్ ఇంజినీర్ హరీష్, ఆలయ ఈవో వెంకటేశు, ఈఈ వెంకటనారాయణ,ఏఈవోలు విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీజకృష్ణారెడ్డి, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

'దళితులను గురజాల కించపరచలేదు'

చిత్తూరు సిటీ, మే7: దళిత మహిళ అయిన తనను గురజాల జగన్మోహన్ కించపరిచేలా మాట్లాడలేదని గుడిపాల మండలం తిరుమలకుప్పం గ్రామానికి చెందిన పూర్ణిమ స్పష్టం చేశారు. మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ మూడు రోజుల క్రితం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ తమ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారని చెప్పారు. ఆ సందర్భంలో తన భర్త తనను విడిచి వెళ్ళిపోయాడని చెప్పడంతో స్పందించిన గురజాల జగన్మోన్ తన భర్తను పిలిపించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భాన్ని వైసీపీకి చెందిన కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి గురజాల మాటలను వక్రీకరించి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.

ఐరాలలో వైసీపీ కవ్వింపు చర్యలు

ఐరాల, మే 7: ఐరాలలో టీడీపీ వారిపై వైసీపీ వారు కవ్వింపు చర్యలకు దిగారు. మంగళవారం రాత్రి ర్యాలీ ఉండటంతో కొందరు టీడీపీ కార్యకర్తలు పార్టీ జెండాలు కట్టారు. ఇంతలో కొందరు వైసీపీ కార్యకర్తలు వాటిని తొలగించారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఇరువర్గాలు వారివారి నాయకులకు ఫోన్‌లో సమాచారం అందించడంతో అందరూ ఐరాలకు చేరుకున్నారు. దీంతో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో అర్ధగంట సమయం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఐరాల పోలీసులు విచ్చేసి ఇరువర్గాలకు సర్ది చెప్పి పంపించి వేశారు.

వైసీపీ ప్రచారంలో టెక్నికల్ అసిస్టెంట్



వెదురుకుప్పం, మే7: ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పెనుమూరులో విధులు నిర్వహిస్తున్న పాలసముద్రం మండలం ఆముదాల సర్పంచ్ అనురేఖ భర్త మదివానందం వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంపై విమర్శలొస్తున్నాయి. శనివారం ఆముదాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి, వైసీపీ పాలసముద్రం మండల అధ్యక్షుడు తులసీరాంను గజమాలతో సత్కరించారు. ఈ ఫొటోలో మదివానందం ఉన్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

గంగాధరనెల్లూరు, మే 7: నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ కైలాష్ వాంకేడ్ కోరారు. గంగాధరనెల్లూరు జడ్పీ హైస్కూల్లో ఈవీఎంల స్ట్రాంగ్ రూమును మంగళవారం ఆయన కలెక్టర్ షన్మోహన్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి, డ్వామా ఏపీడీ గంగాభవాని, మండల ఎన్నికల డీటీ విజయకృష్ణ, డీటీ తులసీరామ్, ఏఎస్‌వోలు ఆనందమోహన్, నాగార్జున, మండల సర్వేయర్ గణేష్, మండల వైస్ ఎంపీపీ హరిబాబు, బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి భాస్కర్ పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలి



యాదమరి, చిత్తూరు రూరల్, నిండ్ర మండలాల్లో రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్న టీడీపీ నేతలు

యాదమరి, మే 7: ల్యాండ్ టైటిలింగ్ యాక్టును వెంటనే రద్దు చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ యాక్టును రద్దు చేయాలని కోరుతూ మంగళవారం యాదమరి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఈ చట్టం వల్ల తాతముత్తాల నుంచి వచ్చిన భూములు అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉందన్నారు. ఒకవేళ కోర్టుకెళ్లి పరిష్కారం చేసుకుందామన్నా సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మురార్జీ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ రబి, నేతలు అమరనాథనాయుడు, రాజమాణిక్యం, మోహన్ పాల్గొన్నారు.

కార్వేటినగరం : ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ మండల టీడీపీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలుగు రైతు అధ్యక్షుడు నాగేశ్వరరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు చెంగల్‌రాయల్ యాదవ్, నాయకులు తిరుమలనాద్, వాసుదేవరెడ్డి, రవియాదవ్ పాల్గొన్నారు.

నిండ్ర : ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేయాలని తహసీల్దారు కార్యాలయ సిబ్బందికి మండల టీడీపీ అధ్య క్షుడు వెంకటేశ్వరావు వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో రవినాయుడు, తంగ రాజ్, వెంకటేశులునాయుడు, తేజేష్, జగన్, రఘు, గంగాధరంనాయుడు, చిట్టిబాబు, మురళీనాయుడు, సురేష్, మనోహర్ నాయుడు, రవికుమార్, రవిరాజు, కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె : భూమి హక్కు చట్టాన్ని రద్దు చేయాలని టీడీపీ నేతలు డిప్యూటీ తహసీల్దార్ నరేష్‌కు వినతి పత్రం ఇచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, నాయకులు మధుకుమార్, క్లస్టర్ ఇన్‌చార్జిలు మోహన్‌నాయుడు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విజయపురం : భూ యజమాని హక్కు చట్టం లోపభూయిష్టంగా ఉందని, ఆ చట్టాన్ని రద్దు చేయాలని టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారులను వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు మునిభాస్కర్‌రాజు, నాయకులు గజేంద్రనాయుడు, అశోక్, బాబు, దొరైరాజ్, లక్ష్మీపతి, చంద్రశేఖర్‌రాజు, కొల్లాపురి, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్ : వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టంలో రైతులు భూములకు రక్షణ లేదని, దీనిని వెంటనే రద్దు చేయాలని చిత్తూరు రూరల్ మండల టీడీపీ నాయకులు ఆర్ఐ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మంజూష్, రాజేంద్రన్, గిరి, కాశి, కాటమరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయానందరెడ్డి అనుచరులతోనే ప్రమాదం

- అతను ఎలా కోటీశ్వరుడయ్యారో అందరికి తెలుసు
- మార్కెట్ గేటు కట్టడంతో లాభం కంటే నష్టమే ఎక్కువ
- గురజాల జగన్మోహన్‌తోనే నగరాభివృద్ధి
- మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్



చిత్తూరు సిటీ, మే 6: చిత్తూరు రాజకీయాల్లో అత్యంత సౌమ్యుడి, వివాదరహితుడిగా పేరున్న వ్యక్తి ఆయన. చిత్తూరు మున్సిపల్ చైర్మెన్‌గా, ఎమ్మెల్యేగా ఉంటూ నగర అభివృద్ధిలో తన మార్కు చూపించారాయన. ఇప్పుడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ గెలుపుకోసం గట్టిగా కృషి చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డికి ఓటేసి గెలిపిస్తే చిత్తూరులో మళ్లీ రౌడీయిజం ప్రారంభమవుతుందంటున్న ఆయనతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ.

విజయానందరెడ్డి గురించి అందరికీ తెలుసు

విజయానందరెడ్డి ఎలాంటి వాడనేది అందరికీ తెలుసు. అతని చుట్టూ ఉన్న వారి గురించి ఇంకా బాగ తెలుసు. అలాంటి నాయకుడ్ని ఎన్నుకుంటే అతని పక్కనున్నవారితో ప్రజలకు చాలా ప్రమాదం జరిగే అవకాశముంది. ఆయన్ను గెలిపిస్తే మళ్లీ చిత్తూరులో రౌడీయిజం ప్రారంభమవుతుంది అనడంలో సందేహం లేదు. ఆయన అనుచరులంతా తక్కువ సమయంలో ఎలా కోటీశ్వరులయ్యారో ప్రజలంతా గమనిస్తున్నారు.

గేటు డబ్బులు కట్టడంతో స్థానిక వ్యాపారులకు నష్టం

చిత్తూరు మార్కెట్ గేటు లేకుండా నాలుగేళ్లుగా డబ్బులు కడుతున్నామని వాళ్లు చెప్పుకుంటున్నారు. ఆయనకు ఆ డబ్బులు ఎలా వస్తున్నాయో ప్రజలకు బాగా తెలుసు. అలా గేటు కట్టడంతో మార్కెట్ లోపల ఉన్న అసలైన స్థానిక వ్యాపారులు, రైతులు తీవ్ర స్థాయిలో నష్టపోతున్నారు. కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి వచ్చే బయటికి వ్యక్తి నగర శివార్లలో వ్యాపారులు చేసుకుని లాభాలు పొందుతున్నారు. ఈ గేటు కట్టడం వల్ల స్థానిక వ్యాపారులకు నష్టం కలుగుతోంది. వాళ్లను కదిలిస్తే వారి బాధ తెలుస్తుంది.

వైసీపీ నాయకులు సొంతానికి అభివృద్ధి అయ్యారు

చిత్తూరులో వైసీపీ నాయకులకు నగర అభివృద్ధి పట్టదు. వ్యక్తిగతంగా అభివృద్ధి అయ్యేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు. రూ.కోట్లలో అక్రమంగా సంపాదించుకున్నారు. వైసీపీ నేతల అవినీతి అక్రమాలతో చిత్తూరులో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైపోయింది. చిత్తూరులో జరిగే ప్రతి ఇల్లీగల్ యాక్టివిటీ వెనుక వైసీపీ నాయకులున్నారు. టీడీపీని గెలిపించి దీన్ని రూపుమాపాలి.

నాగయ్య కళాక్షేత్రం, ఎన్టీఆర్ జలాశయం టీడీపీవే

చిత్తూరు నగరంలో అన్ని పెద్ద పెద్ద కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగపడుతున్న నాగయ్య కళాక్షేత్రం టీడీపీ హయాంలో నేను కట్టించిందే. నగర ప్రజల దాహార్తి తీరుస్తున్న ఎన్టీఆర్ జలాశయాన్ని కల్వకుంట వద్ద నిర్మించిందీ టీడీపీ హయయాంలోనే. మున్సిపల్ చైర్మెన్‌గా ఉన్నప్పుడు నగరంలోని అనేక ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించాను. రైతు బజార్లు, మార్కెట్లు, ఆసుపత్రులు.. వంటివన్నీ టీడీపీ హయాంలో ఏర్పాటు చేసినవే.

● టీడీపీ వస్తేనే రౌడీయిజానికి అడ్డుకట్ట

మళ్లీ చిత్తూరులో టీడీపీని గెలిపిస్తేనే నగర అభివృద్ధి సాధ్యమవుతుంది. రౌడీయిజం లేకుండా పోతుంది. వైద్య, విద్య రంగాలకు అధిక ప్రాధాన్యత నిస్తాం. నాలాంటి సీనియర్ల సలహాను గురజాల జగన్మోహన్ పాటించి నగరాభివృద్ధికి పాటు పడుతారు.

ప్రతి సమస్యను దగ్గరుండి పరిష్కరిస్తా

పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్



ఐరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అబ్బుగుండులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్

ఐరాల, మే 7: పూతలపట్టు నియోజకవర్గంలోని ప్రతి సమస్యను తప్పక పరిష్కరిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. మంగళవారం ఐరాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలసి ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. వారు పలు గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకుని టీడీపీ విజయానికి కృషి చేయాలన్నారు. వైసీపీ వారు రాజకీయంగా ఎదుర్కొన లేక దాడులు చేస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికలలో ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు గంగారపుహరిబాబునాయుడు, ఎంఎస్‌చౌదరి, సోమశేఖర్‌నాయుడు, వెంకటేష్ నాయుడు, యబ్బారివేణుగోపాల్, కొల్లారమేష్, ధనంజయనాయుడు, లత, లోకనాథరెడ్డి, రంజిత్‌రెడ్డి, గంగారపుగోపి తదితరులు పాల్గొన్నారు.

భాను సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు

నగరి/నిండ్ర, మే7: నగరి టీడీపీ కార్యాలయంలో మంగళవారం పలువురు వైసీపీ నాయకులు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. నగరి మున్సిపల్ చైర్మన్ నీలమేఘం కుమారుడు సంపత్‌కుమార్ టీడీపీలో చేరారు. నిండ్ర దళితవాడకు చెందిన 20 కుటుంబాల వారు మురళీనాయుడు, మనోహర్‌నాయుడు ఆధ్వర్యంలో భానుప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరినవారిలో శీనయ్య, ఎలుమలై, చిన్నరాజ్, రవీంద్రన్, పవన్, వెంకటేశులు, బలరాం, జయరాం, పయణి, రమేష్, రజని, శరత్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులు

పుత్తూరు అర్బన్ : పుత్తూరు అభివృద్ధి సాధించడంలో మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడిది చెరగని ముద్రని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇనుకొండ సుబ్రమణ్యం స్పష్టం చేశారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న వైసీపీ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి రోజా ఏమి చేసిందని నిలదీశారు. కుటుంబ సభ్యులకు ఒక్కొక్క మండలాన్ని అప్పగించి దోచుకుందని ఆరోపించారు. తిరిగి ప్రశాంతమైన పుత్తూరు కావాలంటే టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. గాలి జీవరత్నంనాయుడు, ఎస్ఎస్ ధనపాల్, డీజీ ధనపాల్, సింగంశెట్టి సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర మద్యం తాగి ఆసుపత్రులపాలు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్



గంగాధరనెల్లూరులో థామస్‌కు క్రేన్‌తో గజమాల వేస్తున్న అభిమానులు

గంగాధరనెల్లూరు, మే 7: ఆంధ్రలో ప్రభుత్వం విక్రయించే మద్యాన్ని మందుబాబులు సేవించడంద్వారా అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చేరి ఆర్థికంగా అప్పులపాలవుతున్నారని గంగాధరనెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గంగాధరనెల్లూరు బస్టాప్ కూడలిలో మంగళవారం రాత్రి ప్రచార వాహనంపై టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్‌కు క్రేన్‌తో గజమాలను వేసి, టపాసులు కాల్చి పలువురు టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి పుత్తూరు రోడ్ వైపులో సంతవీధి జంక్షన్, అల్లియెల్లమ్మ గుడి, పోలీస్‌స్టేషన్ మీదుగా గంగమ్మ గుడి, బాలుర హాస్టల్ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగాధరనెల్లూరు ఎమ్మెల్యేగా నారాయణస్వామికి రెండుసార్లు ఓట్లువేసి అవకాశం ఇచ్చినా ప్రజలకు ఆయన ఎలాంటి న్యాయం చేయలేదని, వారి కుటుంబసభ్యులు మాత్రం ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి చెందారని, తనకు దేవుడి దయవల్ల చెన్నైలో ఆసుపత్రి నిర్వహణ ద్వారా డబ్బులతో పాటు ఆస్తులు బాగా సంపాదించానన్నారు. ప్రజాసేవకోసమే టీడీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్నానని మీఓట్లు ఒక్కసారి సైకిల్ గుర్తుపై తనకువేసి ఎమ్మెల్యేగా గెలిపించి, ఒక్కసారి అవకాశం ఇవ్వాలని మీపాదాలకు దండంపెట్టి వేడుకుంటున్నానని అభ్యర్థించారు. ఈర్యాలీలో సైకో పోవాలి...సైకిల్ రావాలి అనే పాటకు పార్టీ కండువాలు, పసుపు టవల్స్‌ను నేతలతో కలిసి ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ తిప్పుతూ డ్యాన్స్‌లు వేసి అలరించారు. ఈకార్యక్రమంలో టీడీపీనేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, వెంకటేష్, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, దేవసుందరం, రాంబాబు రెడ్డి, వై.వి.రాజేశ్వరి, జ్యోతిరెడ్డి, పుష్పరాజ్, కేతినేని లోకేష్‌నాయుడు, మురళీశ్వర్‌రెడ్డి, శేఖర్, శివప్రసాద్, క్రిష్ణన్, హరిప్రకాష్, ప్రకాష్, ఆనంద్‌బాబు, గోపి, లోకమ్మ, భువనేశ్వరి, బీజేపీనేతలు మణివర్మ, ఇడగట్టి సుధాకర్, మురళి, జనసేన నేత సురేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

వెదురుకుప్పం : పచ్చికాపల్లం పంచాయతీ నక్కలాంపల్లెలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును గెలిపించాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నరసింహులు అభ్యర్థించారు. ఎమ్మెల్యే అభ్యర్థి తమ్ముడు నిధి, నాయకులు పి.మోహన్‌మురళీ, చెంగల్రాయరెడ్డి, ఎం.రాజశేఖర్‌వర్మ, వెంకటరమణారెడ్డి, మోహన్ యాదవ్ పాల్గొన్నారు. బొమ్మయ్యపల్లె పంచాయతీలో టీడీపీ తరపున బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్ ప్రచారం చేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

పాలసముద్రం : మండలంలోని వనదుర్గాపురం, ఎగువ వనదుర్గాపురం, ఆదిఆంధ్రవాడ, దిగువ వనదుర్గాపురంల్లో మండల టీడీపీ నేత శేఖర్‌రాజు ఇంటింటికీ వెళ్ళి బ్యాలెట్ పేపర్ నమూనా చూపించి ఓటు వేసే విధానాన్ని వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావులను గెలిపించాలని కోరారు. నాయకులు శీనురాజు, రామకృష్ణమరాజు, నవీన్, ఏయుమళై, సాంబశివన్, అరుళ్‌నాథన్, తంగరాజ్ పాల్గొన్నారు.